


# నా గది

కె. ఎస్. గీతాదేవి

అది నా గది. ఆ గది గురించి చెప్పాలంటే చాలా వుంది. ఎక్కడ నుంచి ప్రారంభించను? గది గురించి మొదలుపెట్టే ముందు ఇంటి గురించి కాస్త చెప్పాలి.

మాది ఓ రేకుల ఇల్లు. "కొత్తగా మీ ఊరు వచ్చినవాళ్ళు మీ ఇల్లుని చూసి సినిమా హాలు అనుకుంటారు" అని పెళ్ళయిన కొత్తలో మా బావగారు అక్కయ్యని వెక్కిరించేవాళ్ళు. పైకి రేకుల షెడ్డులా వున్నా, లోపల ఫాల్స్ సీలింగ్‌తో బాగానే వుండేది.

ఇంటి చుట్టూ ఎత్తయిన ప్రహరీ గోడ, ఇంటి ముందు పెద్ద వేపచెట్టు, సిమెంటు చప్టా చేసిన ఖాళీ స్థలం, ఓ మూల రేకుల కారు గారేజి, వెనక పెద్ద పెరడు - ఇదీ బయటకు కనిపించే మా ఇంటి ఆకారం. ఇక అసలు ఇల్లు రెండు వరసల్లో ఆరు గదులుగా వుంటుంది. గదులని ఆనుకొని పెరటి వరండా, స్టోర్ రూం, వంటిల్లు.

నాన్నగారి ఆఫీసు గది వెనకగా పెద్ద బెడ్‌రూం ప్రక్కగా రోడ్డు మీదకి ఓపెన్ అయిన కిటికీతో వుండేదే నా గది. ఆ గదిలోనే నేను పుట్టి పెరిగాను - పంతొమ్మిదేళ్ళు గడిపాను. నాకు ఎనిమిదేళ్ళప్పుడు హాస్టల్‌కి అన్నయ్య, ఆ తరువాత సంవత్సరం పెళ్ళయి అక్కయ్య వెళ్ళిపోయిన దగ్గర నుంచి ఆ గదికి ఏకైక వారసురాలిగా మిగిలాను.

ఓసారి వేసవి శెలవల్లో అన్నయ్యతో "ఈ గది నాది అంటే నాది" అని పోట్లాడి, ఎదిరించి గెలవలేక, తను అలా హాస్టల్‌కి వెళ్ళగానే ఇండియన్ ఇంకుతో హాల్లో అందరికీ కనిపించేలాగా గది తలుపు మీద 'నిత్యాస్ రూం' అని వంకర టింకర అక్షరాల్తో వ్రాసి ఆ గది మీద నా అధికారాన్ని డిక్లేర్ చేసి, విజయం నాదే అని సంతృప్తిపడ్డాను.

స్కూల్‌లో వున్నప్పుడు ఇంట్లో వున్నది, గదిలో గడిపినది తక్కువ. ఎంతసేపు ఆటలు, ఊర్లో వున్న సందుగొందులు పట్టుకొని తిరగడమూనా. ఒక్క వేసవి శెలవల్లో తప్పితే మిగతా రోజుల్లో అంతా ఇదే కార్యక్రమం. వేసవిలో మటుకు అమ్మ మధ్యాన్నంపూట పెద్దగేటుకి తాళం వేసి మరీ ఇంట్లో బంధించేది- వడదెబ్బ తగులుతుందనీన్నూ, ఎండలో తిరిగి కాకుల్లా అవుతామనీన్నూ.

ఇక అప్పుడు నా గది ఇన్‌డోర్ స్టేడియంగా మారేది. మధ్యాహ్నం కిటికీలు, తలుపులు మూసి గదంతా చీకటి చేసి 'డార్క్ రూం' ఆడడం, ఓ రెండు పెద్ద పిల్లోస్‌కి తాడు కట్టి సీలింగ్ ఫాన్ నుంచి వ్రేలాడ తీసి వాటిని 'పంచింగ్ బాగ్స్'గా ఉపయోగించడం. పాండ్స్ పౌడర్ టిన్ను నెమ్మదిగా చప్పుడు కాకుండా అమ్మ డ్రెస్సింగ్ టేబిల్ మీద నుంచి తెచ్చి గది తలుపులు వేసి, మంచాలు మూలలకి తోసేసి టిన్నులోని పౌడరు అంతా నేల మీద పోసి గదంతా పలుచగా నెరిపి, అరికాళ్ళకి బాగా పూసుకొని స్కేటింగ్ లాగా జర్రుమని ఆ మూల నుంచి ఈ మూలకి స్లైడింగ్!

నాకు వయస్సు వచ్చి పెద్దయ్యేకొద్దీ నా గది మారసాగింది. ప్రతీ సంవత్సరమూ వేసే సున్నం పొరలు పొరలుగా ఏర్పడి, గోడలు అదోరకం తెలుపులోకి మారాయి. పల్లంచి రాళ్ళు, బొమ్మలు, బొంగరాలు, గుడ్డ పీలికలు, చాక్‌లేట్ కాగితాలు కప్ బోర్డులోంచి మాయమవసాగాయి - వాటి స్థానాన్ని పుస్తకాలు నీట్‌గా అట్టవేసినవి వచ్చాయి.


క్రమంగా నేను గదిలోనే గడిపే కాలమూ ఎక్కువ అయింది. చిన్నప్పుడు శుభ్రంగా, ఖాళీగా వుండే నా గది 'టిపికల్ టీనేజర్స్ రూం' గా మారింది. గది మధ్యలో ఓ పెద్ద మంచం, దాని మీద అడ్డదిడ్డంగా తలగడాలు, ఓ ప్రక్క కుప్పగా వున్న బ్లాంకెట్. మంచం హెడ్ మీద అతికించిన 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' బొమ్మ. చదవాలి అనిపించనప్పుడు అందుకునేందుకు వీలుగా తలగడ

క్రింద ఫియాన్సీ వ్రాసిన ఉత్తరాల కట్ట. మంచం క్రింద ట్రాన్సిస్టర్. మూల వుంచిన ఇంకో చిన్న మంచం మీద కుప్పలుగా పడివున్న పాత రీడర్స్ డైజెస్ట్. కొత్త ఫిలిం మాగజైన్స్, అందమైన అడ్వర్ టైజ్ మెంట్ కటింగ్స్. కిటికీలో చిందరవందరగా పడి వున్న బ్రష్‌లు, రంగు జాడీలు, ఓ మూల బోర్డు మీద సగం వేసి వదిలేసిన బొమ్మ. స్టడీ టేబిల్ మీద దుమ్ముతో నిండిన సీల్ విప్పని కరస్పాండెన్స్ కోర్స్ లెసన్స్. వాటి ప్రక్కనే వెదురు వాజ్‌లో ఎండిన గడ్డి పువ్వులు, లేత వెదురు కొమ్మలు. ఆ ప్రక్క గోడ మీద బాపు జనార్దనాష్టకం బ్లోఅప్. పుస్తకాల బీరువా తలుపులకి అతికించిన బోసి నవ్వుల పాపలు, రష్యన్ బాలే డాన్సర్స్ ఫోటోలు. స్టాండు కన్పించనంతగా దాని మీద మంచి వ్రేలాడు తున్న బట్టలు.

ఈ బాక్ గ్రౌండ్‌లో కలిసిపోయి, వెలిసిపోయిన హవుస్ కోట్‌లో, మొహం మీద కొత్త, పాత పెంసిల్స్‌తో షాలీగా నేను!!

ఇంట్లో అందరూ నన్ను, నా గదిని మార్చాలని తీవ్రంగా ప్రయత్నించి "దానికి శుభ్రత అన్నది అస్సలు లేదు" అని తీర్మానించి వదిలేసారు. మా అమ్మ మటుకు అప్పుడప్పుడు నేను ఫ్రెండ్స్ ఇంటికి వెళ్ళి నప్పుడో, తలంటి స్నానం చేస్తూ బాత్‌రూంలో వున్నప్పుడో మూసి నా గది సర్దుతూ వుండేది.

ఇంతలో నాకు పెళ్ళయింది. గది, ఇల్లు వదిలి వెళ్ళాల్సి వచ్చింది. 'మా' చిన్ని ఇంట్లోకి 'నా' పాత గదిలోని కొన్ని వస్తువులు తెచ్చుకున్నాను. ఇంట్లో




సామాన్లు అన్నీ పద్ధతిగా అమర్చుకున్నాను. బట్టలు అవీ కూడా అలమరాల్లో పొందిగ్గా మడిచి పెట్టుకున్నాను. ఎవరు ఏ సమయంలో వచ్చినా ఎక్కడి వస్తువులు అక్కడ వుండి 'ఇల్లు నీట్‌గా వుంది' అన్న కాంప్లిమెంట్స్ వస్తూ వుండేవి. మావాళ్ళు నేను ఇల్లు పెట్టుకునే విధానం చూసి ఆశ్చర్యపోయారు. ఇంత నీట్‌గా వున్న రూంలో ఎలా వుంటున్నావు అని మా బెడ్‌రూం చూసి ఆటలు పట్టించారు. వెల్, నేను కూడా బోల్డు ఆనందపడిపోయాను - గృహిణిని కదా మరి ఇప్పుడు.

కాని మధ్యలో పరీక్షలు వ్రాయడానికీ శ్రీవారు విదేశాలకి వెళ్ళినప్పుడు అమ్మ వాళ్ళింట్లో కొన్ని నెలలు వున్నాను. చిత్రం! అక్కడ నా పాత గదిలో అడుగు పెట్టిన మరుక్షణం నుంచి నా పాత అలవాట్లు అన్నీ 'హలో' చెప్తు వచ్చేసాయి. నేను వచ్చిన రెండు రోజుల లోపలే నా గది పూర్వంలా అయిపోయింది. సూట్‌కేస్ మూత తెరుచుకొని బట్టలు బయటకి పడిపోతూనూ, మంచం మీద నలిగిన దుప్పటి, మడవని బ్లాంకెట్, తలగడ క్రింద శ్రీవారి లేఖలు, గోడమీద హుక్‌కి వేలాడుతూ వాక్‌మాన్, మంచం క్రింద వేరుశెనగ తొక్కలతో నిండిన ప్లేట్, కడగని కాఫీ మగ్గు, టేబిల్ మీద పాత నవలలు, కొత్త పత్రికలు, వచ్చిన ఆర్టికల్స్ కటింగ్స్, కిటికీలో కొండమీద చల్లగాలికని వెళ్ళి తెచ్చిన వడలిన గడ్డి పువ్వులు - ఓ మూల ఊగే కుర్చీలో లేజీగా నేను - అంతా ఎప్పటిలాగానే!!

అయితే, అంతా పూర్తిగా పూర్వంలాగా లేదు. గోడ మీద నాకు వచ్చిన పోస్టర్స్ లేవు. కనీసం పోస్టర్స్ తాలూకు మార్కింగ్స్ అయినా లేవు - కొత్తగా వేసిన సున్నంతో కప్పబడిపోయాయి అవి. అలాగే ఇండియన్ ఇంకులో చిన్నప్పుడు గది తలుపు మీద వ్రాసిన 'నిత్యాస్ రూం' అనే వంకర టింకర అక్షరాలు ఇప్పుడు లేవు. తలుపులకి వేసిన కొత్త పెయింట్ వీటిని చెరిపేసింది. అయినా ఇంకా ఇంట్లో అందరూ దానిని 'నిత్యా గది' గానే వ్యవహరిస్తున్నారు. అవును, 'ప్రస్తుతానికి' అది ఇంకా నా గదే.

---

దూరంగా కొండలు, కొండమీది నుండి చూస్తే క్రింది పొలాలు, తాటిచెట్లు, గుళ్ళు, గోపురాలు, చాలా చిన్నవిగా కనబడుతున్నాయి. తూర్పునుండి పశ్చిమంగా రైలు లైను ఒకే సరళరేఖలా వుంది. కొండమీది చిన్నతుప్పలు నరుకుతున్న శ్రామికుని గొడ్డలి చప్పుళ్ళు చిరాకనిపించింది. వాడు ఈ ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగిస్తున్నాడు.

"ఏయ్, సాయంకాలమయింది, నీ ఇంటికి పోకూడదా" అన్నాను. ఆ కూలివాడు ఒకసారి నా వంక చూసి మరల తన పనిలో నిమగ్నమయిపోయాడు. చెవిటి వాడేమో అనుకొని దూరంగా కూర్చున్నాను. గొడ్డలి చప్పుళ్ళు అలాగే వినబడుతున్నాయి. కొండ క్రింది పల్లె పిచ్చిక గూళ్ళలా కనబడుతుంది. నాకు నవ్వొచ్చింది. నేనే మహామానవుడుగా,ఆ ఇళ్ళలో వున్న వాళ్ళందరూ మరుగుజ్జుల్లా భావించుకున్నాను. చిన్నరాయి తీసుకొని క్రింది ఆ ఇళ్ళవైపుకి విసిరాను. ఆ రాయి క్రింది లోయలోకి ఎక్కడో జారిపోయింది. అప్పుడే క్రింది రైలులైను మీదు నుండి జెర్రిపోతులా ఒక మనుషుల బండి పరిగెడుతూ పోతోంది. పరుగెడుతున్న రైలు బండికి కొన్ని రాళ్ళు గురిచూసి విసిరాను. పడమటగాలికి కొండమీద చెట్లు 'శెహభాష్' అంటూ తలలూపాయి. ఉత్సాహంతో గట్టిగా ఈలవేశాను.అక్కడ నేలమీదవున్న ఒకలాటి కర్ర లాంటి కర్ర తీసుకొని కొండపైకి ఎక్కడం మొదలుపెట్టాను. ఎదురుగా చెట్టు పక్కగా పెద్దబండపై, ఎవరో కళ్ళు మూసుకొని ధ్యానంలో నిమగ్నమయివున్నాడు. నాకు ఇలాంటి తపస్సు అంటే చిరాకు. "ఎవ్వడా నువ్వు కొంగలా దొంగ జపం చేస్తున్నావు" అంటూ చేతిలో కర్రతో పొడిచాను. అతను నెమ్మదిగా కళ్ళు తెరిచి మూసుకున్నాడు. నేను ఇంకా కొండ శిఖరానికి పోదామని పై కెక్కుతున్నాను. చెట్ల మీద పక్షులు నన్ను చూడగానే ఒక్కసారిగా పైకి




ఎగిరిపోయాయి. నేనంటే ప్రకృతిలో పక్షులకు కూడా హడలే! కొండ మామిడి చెట్టుమీద చిలకల జంట కువకువలాడుతున్నాయి. చేతికర్ర వాటికేసి గురి చూసి విసిరాను. జంట పక్షులలో ఒకటి వచ్చిపడింది. వచ్చి పడిన ఆ పక్షి చుట్టూ చిలకమ్మ కీచుకీచు మంటూ గిరికీలు కొడుతుంది. దాని శోకానికి మూలకారకుడు నేనే అయినందుకు గర్వంగా ముందుకు నడిచాను.

నేను దాదాపు శిఖరానికి వచ్చాను. చుట్టూ నిశ్శబ్దం, దూరంగా పర్వత సమూహాలు ఇంచుమించు ఆకాశపు రంగులో కనబడుతున్నాయి. ఉత్తర దిక్కు నుండి చల్లని వానగాలి నన్ను తాకింది. నల్ల మేఘాలు ఆకాశంలో చాలాభాగం ఆక్రమించేశాయి. తళుక్కున మెరుపు, ఉరుము, వర్షం అలా ఇలా కాదు చాలా గట్టిగా పడే సూచనలు కనిపిస్తున్నాయి. వర్షానికి నిలవడానికి ఎటువంటి ఆధారము లేదు, కొండమామిడి చెట్లుతుప్పలూ పలుచగా వున్నాయి. అవి నాకు రక్షణ ఇచ్చేట్టు లేవు, పైగా చీకటి పడబోతుంది. క్రిందికి తొందరగా దిగక పోతే, తడిసిముద్ద అవడం ఖాయం. నాలుగు అడుగులు ముందుకు వేశాను.అయిదో అడుగు జారుడు రాళ్ళమీద పడింది- అంతే తరువాత ఏమయిందో నాకు తెలియదు.

కళ్ళు తెరచి చూచేటప్పటికి, నాకు శ్రామికుడు దీన ముఖంతో కనిపించాడు, యోగి నా నోటికి పళ్ళ రసం అందించాడు. పళ్ళ రసం త్రాగి చుట్టూ చూశాను. అది చిన్న తాటాకుల పాక. నన్ను రక్షించిన ఇరువురు మనుషులు, బయట జోరున వాన, నా గుండెల్లో అహంభావపు ఘోష ఏ లోయల్లోకో జారిపోతూంది...